# నిన్నటి గెలుపు

ఎండ మండిపోతుంది.

రేడియోలో తెలుగులో వార్తలు వస్తున్నాయి. శ్రీవారూ, పిల్లలూ వెళ్ళిపోయిన తరువాత ఇల్లంతా సర్దుకుని భోజనం చేసి, వార్తలు వింటూ సోఫాలో కూర్చున్నాను. ఫాను గాలికి రెపరెపలాడుతూ ఉంది ఆంధ్రప్రభ వీక్లీ. రేడియో ఆపేసి వీక్లీ తీసుకుని చూస్తున్నాను.

'పోస్ట్' అన్న కేక వినిపించగానే లేచి వెళ్ళి పోస్టుమన్ అందించిన కవరు అందుకుని వచ్చి సోఫాలో కూర్చుని కవరు చించాను. ఉత్తరం కాలేజీ స్నేహితురాలు సుమిత్ర దగ్గర నుంచి.

"డియర్ ప్రభా!

నీకు చాలా రోజుల తర్వాత ఉత్తరం రాస్తున్నందుకు ఏం అనుకోకు. కాలేజీ రోజుల్లోలా, కాపురానికి వచ్చిన కొత్తలోలా నీకు ఇప్పుడు ఉత్తరాలు ఎలా రాయగలను చెప్పు? ఏదో ఒక అవసరం వస్తే తప్ప మన స్నేహం గుర్తుకి రావటం లేదు అనుకుంటూంటే నవ్వు వస్తోంది నాకు. నువ్వూ నవ్వుతావు. నాకు తెలుసు. సరే, ఈ విషయాలు వదిలేసి ఓ ముఖ్య విషయం చెప్తున్నాను విను. నా రెండో కూతురు సుశీల నీకు తెలుసు కదూ? అది బి.ఎస్.సి. పూర్తికాకుండానే మా కులం కాని వాడిని ప్రేమించింది. పెళ్ళాడేసిన తర్వాత చెప్పింది. అతనికి ఉద్యోగం లేదు. అయినా ఏదో తంటాలుపడి మీ ఊళ్ళో ఉద్యోగం వేయించాం. అతనిక్కడ జాయిన్

అయ్యాడు. సునీలని కూడా తీసుకుని వెళ్ళిపోయాడు. సునీలకి వంట రాదు. అసలు ఏ పని రాదు. అతిగారంగా పెరిగిన అది హఠాత్తుగా పెళ్ళి చెసుకుని వెళ్ళిపోయింది. అక్కడ తన ఇల్లు ఎలా చక్కదిద్దుకుంటుందో అన్న భయం నాకు. నువ్వు వెళ్ళి దాన్నీ, దాని ఇంటినీ చూసి వెంటనే ఉత్తరం రాయి. నీ ఉత్తరం ఎదురుచూస్తుంటాను. ఆడపిల్లలు లేని నువ్వు అదృష్టవంతురాలివి అనిపిస్తూ ఉంటుంది నాకు. నీ భర్తా, పిల్లలూ కులాసాగా ఉన్నారని తలుస్తాను.

ఇట్లు

సుమిత్ర."

"అన్నట్లు మరిచాను. సునీల ఇంటి అడ్రెసూ, అల్లుడి ఆఫీసు అడ్రెసూ ఈ పక్కన ఇచ్చాను."

ఉత్తరం ఒకటికి రెండుసార్లు చదివి మడిచి కవర్లో పెట్టాను.

దాదాపు నాలుగైదు క్రితం ఈ సునిలని చూశాను. చిన్నపిల్లలానే అనిపించింది. అప్పుడే తనకి తానుగా ఓ కుర్రాడిని ప్రేమించటం, ధైర్యంగా పెళ్ళాడేయటం, కొత్త కాపురం పెట్టేయటం చిత్రంగా అనిపించ సాగింది. ఆడపిల్ల పెళ్ళి చేయటం అంటే హడలి చస్తున్నారు తల్లి తండ్రులు. తన సామర్థ్యంతో తల్లిదండ్రులని తేలికపరచిన సాహసవంతురాలైన సునీలని ఆ క్షణంలో వెళ్ళి చూడాలనీ, శుభాకాంక్షలు చెప్పాలనీ మనను మహా తొందర పెట్టేయ సాగింది. కానీ, శ్రీవారు వచ్చిన తర్వాత ఇద్దరం కలిసి వెడితే బాగుంటుందనీ, ఆ అడ్రెస్‌లు ఆయన గారు వెంట ఉంటే తప్ప నాకు తెలుసుకోవటం కష్టమనీ మనసుని సమాధానపరుచుకుని ఉండిపోయాను.

'ఆడపిల్లలు లేని నువ్వు అదృష్టవంతురాలివి' అన్న సుమిత్ర మాటకి నవ్వు వస్తోంది, బాధగానూ అనిపిస్తోంది. ఎందుకంటే, నాకు ఆడపిల్ల అంటే చాలా ఇష్టం. ఆడపిల్ల ఇంటికి లక్ష్మి అన్న నమ్మకం. భగవంతుడు మనం కావాలన్నది ఇవ్వడు. నాకు ఇద్దరూ మగపిల్లలే.

"చాలు" అంటూ శ్రీవారు పుల్‌స్టాప్ పెట్టేస్తుంటే నేను గొడువ చేశాను!

"ప్రభా! ఈ కాలంలో అబ్బాయి అయినా, అమ్మాయి అయినా టూ మెంబర్స్-అంతే-బస్. పుల్‌స్టాప్ పెట్టెయాలి" అనేశారు.

"అలాక్కాదు. నాకు ఆడపిల్ల కావాలి" అన్నాను మొండిగా.

"సిల్లీగా ఆలోచించకు. మనం కావాలనుకున్న రెండు అవకాశాలకీ భగవంతుడు ఎవరిని ఇచ్చినా సంతోషంగా స్వీకరించాలి." ఉపసమ్య ధోరణిలో అనేసి ఆ సంభాషణ కట్ చేయటం ఆయన ప్రత్యేకత.

అలా గడుస్తూండగానే ఇద్దరు కొడుకులూ కాలేజీ చదువులకి వచ్చేశారు. ఆ ఇద్దరినీ వెయ్యి కళ్ళతో చూసుకోవటం, ఆఫీసరు ప్రమోషను వచ్చినా, అప్పర్ డివిజన్ క్లర్కుగా ఉన్నా ఒకేలా ఉండే శ్రీవారి ఆలోచనలనీ, అభిప్రాయాలనీ ఇష్టం ఉన్నా లేకున్నా అనుసరిస్తూ సాగిపోవటమే ధ్యేయం అన్నట్టుగా కాలం గడుస్తోంది నాకు.

సుమిత్ర ఉత్తరం నాలో చాలా సంచలనాన్ని తెచ్చింది.

ఈ తరం ఆడపిల్లని అయే అదృష్టం నా కెలాగూ లేదు. అయినా, 'ఈ తరం ఆడపిల్లకి జై' అని గట్టిగా అరవాలన్నంత ఆనందంగా అనిపించసాగింది.

శ్రీవారు ఆఫీసు నుంచి ఆలస్యంగా వచ్చారు. ఆయన బట్టలు మార్చుకోకుండానే సుమిత్ర రాసిన ఉత్తరం ఇచ్చాను. ఆయన ఉత్తరం చదివి నా చేతికిచ్చి తాపీగా బట్టలు మార్చుకుంటూ-"రేపు సండే కదూ వెళ్ళి వద్దాం" అన్నారు-అంతే!

నాకు చాలా కోపం వచ్చింది. 'ఈయన ఎప్పుడూ ఇంతేగా 'అనుకుంటూ భోజనం వడ్డించే ప్రయత్నంలో పడ్డాను. శ్రీవారు తాపీగా భోజనం చేసి ఆ తర్వాత చాలా సేపు ఏవో పుస్తకాలు చదువుకుని, హాయిగా నిద్రపోయారు. నాకు మాత్రం నిద్ర రావటం లేదు.

## 2

సునీల అడ్రెస్ తీసుకుని, ఒకటి, రెండు రకాల ఊరగాయలు సీసాల్లో సర్దుకుని, స్వీట్స్ తెప్పించి బయలు దేరుతూంటే బాబు అడిగాడు.

"ఎక్కడికి, మమ్మీ?"

విషయం చెప్పాను.

'ఇంతేనా?' అన్నట్టు చూశాడు నావైపు.

"ఏం?ఇది గొప్ప విషయం కదూ?" రెట్టించి అడిగాను.

'నీ వన్నీ పిచ్చి సెంటిమెంట్లు, మమ్మీ' అన్నట్టుగా చూసి అక్కడి నించి వెళ్ళిపోయాడు. శ్రీవారు స్కూటర్ వాకిట్లోకి తీసుకునివెళ్ళి ఆలస్యం అవుతోందని అన్నట్టుగా హారన్ వేయసాగారు. నేను త్వరత్వరగా ప్లాస్టిక్ బుట్ట తీసుకుని బయటికి నడిచాను.

"అడ్రెస్ ఏదీ?"

"అరెరె- మర్చిపోయాను" అంటూ తిరిగి లోపలి కెళ్ళి ఎక్కడ పెట్టిందీ గుర్తులేక పావుగంట వెతికి, ఎలాగో సుమిత్ర ఉత్తరం తీసుకుని వచ్చి స్కూటర్ ఎక్కాను.

కాస్త వెతుక్కోవలసి వచ్చినా త్వరగానే ఇల్లు తెలిసింది.

చుట్టూ ప్రహరీ లోపల అందమైన పూలమొక్కలు మూడేసి గదులున్న మూడు పోర్షన్లు ఉన్నట్టుగా తలుపుల దగ్గర వారి వారి అడ్రెసులు తెలుపుతూ నేమ్ ప్లేట్లు కొత్తవారికి ఇబ్బంది కలగకుండా చేస్తున్నాయి మధ్యగా ఉన్న వాటా తలుపు మీద 'శాంతిమోహన్' అన్న పేరు కనిపించింది.

"ఇదే ఇల్లు." శ్రీవారు చెప్తూ స్కూటర్ ఆపారు.

గేటు తీసుకుని వెళ్ళి కాలింగ్ బెల్ నొక్కాను.

వెంటనే తలుపు తెరుచుకుంది. గళ్ళ లుంగీ, తెల్ల లాల్చీ వేసుకున్న యువకుడు ఆరోగ్యంగా, అందంగా, హుందాగా కనిపించాడు.

'ఎవరు?' అన్నట్టు చూశాడు.

"మీరు శాంతి మోహన్ కదూ?"

"ఔను. మీరు - మా అత్తగారి...."

"ఆఁ.... మీ అత్తగారి ఫ్రెండ్‌ని. ఆయన మా శ్రీవారు." గడగడా పరిచయం చేశాను.

"రండి లోపలికి" అంటూ కుర్చీలు చూపించాడు.

ఇద్దరం కూర్చున్నాం.

"ఇప్పుడే వస్తాను." అతను మధ్యగదిలోకి వెళ్ళాడు.

మేము కూర్చున్న గది డ్రాయింగ్ రూములా ఉంది. గోడకి సునీల. శాంతిమోహన్‌ల పెళ్ళిఫొటో పక్కన గాంధీగారి ఫొటో ఉంది. ఇంకా ఒకటి, రెండు నిర్మల్ పెయింటింగులున్నాయి. ముడుకొత్త కుర్చీలూ, కొత్త టీపాయ్ కొత్త కాపురంలానే కొత్త కొత్తగా కనిపిస్తున్నాయి.

"సునీలా! లే త్వరగా. మీ మమ్మీ ఫ్రెండట ఆవిడా, ఆవిడ భర్తా వచ్చారు లే!"

అతను ఎంత మెల్లగా లేపుతున్నా మాకు వినిపిస్తూనే ఉంది అతని గొంతు.

"ఆఁ! ప్రభా ఆంటీ వచ్చిందా!" సునీల లేచి నైట్ గౌనులోనే వచ్చేసింది.

"ఆంటీ, ఎలా ఉన్నావూ? .. అంకుల్! బావున్నారా?" ఇద్దర్నీ ఒక్కసారే పలకరించేసింది.

అందమైన సునీల అప్పుడే విచ్చిన రోజాలా ఉంది. ఇంకా ఇంకా ఆ పిల్లని చూడాలనిపించసాగింది శాంతిమోహన్ ఈ పిల్ల పక్కన సరీగ్గా సరిపోయాడు. ఎంత చక్కని సెలక్షన్। ఎన్నో జంటలను చూస్తుంటాం. నూటికి డెబ్బై దాంపత్యాలు ఈడూ జోడుగా కనిపించరు. వీళ్ళు అలా కాకుండా చక్కగా ఉన్నారు. ఈ అభిప్రాయం సుమిత్రకి రాయాలి అనుకున్నాను మనసులో,

'ఆంటీ ఏంటీ? కబుర్లు చెప్పక ఏదో ఆలోచనలో పడ్డావు।"

"ఆఁ ఏం లేదు. మీ అమ్మ నీకు వంటరాదని రాసింది. అయినా' నే నున్నానుగా అప్పుడప్పుడూ ఇలాంటి ఊరగాయలూ వగైరా పంపి స్తూంటాను. చూడూ ఇవి తీసుకుని లోపల పెట్టుకో." ప్లాస్టిక్ బుట్ట తీసు కుని, స్వీట్ పాకెట్ సునీలకి అందించి బుట్టక్కూడా ఇచ్చాను.

సునీల తెగ మురిసిపోసాగింది.

శాంతిమోహన్ అప్పటికే రెండు, మూడుసార్లు హెచ్చరించాడు 'ముందు వెళ్ళి ముఖం కడుక్కురా' అంటూ.

సునీల వినిపించుకునేలా లేదు.

అతను లేచి లోపలి కెళ్ళి కాఫీ కలిపి తెచ్చాడు.

శ్రీవారు ఒకటి, రెండు మాటలు మాట్లాడుతూ అక్కడున్న ఇంగ్లీషు పేపరు తీసుకుని చూడసాగారు.

శాంతిమోహన్ ట్రేలో కాఫీ తెస్తుంటే నాకు అదోలా అనిపించింది.

'మీరు.... తేవటం ఏమిటీ?' అన్నాను ఇబ్బందిగా అతను అందించే కప్పు అందుకుంటూ.

'సునీలా, వెళ్ళు। ముఖం కడుక్కురా।' శాంతి మోహన్ మరో సారి అన్న తర్వాత సునీల లేచి లోపలి కెళ్ళింది.

శ్రీవారు శాంతిమోహన్ ఉద్యోగం వివరాలు తెలుసుకుంటూ

కబుర్లు మొదలెట్టారు. నేను లేచి లోపలి కెళ్ళాను. చిన్న వంటగదీ, మధ్య గదిలో రెండు మంచాలూ, డ్రెస్సింగ్ టేబిలూ, మిగతా సామానూ అంతా చక్కగా సర్ది ఉంది.

'సునీలకి పనే రాదంది సుమిత్ర. ఇల్లు ఫర్వాలేదు బాగానే ఉంది' మనసులో అనుకున్నాను.

'ఆంటీ, నాకేం పని రాకున్నా, వంట రాకున్నా ఏం ఇబ్బందిగా లేదు.

శాంతికి అన్ని పనులూ వచ్చు. అందువల్ల హాయిగా ఉంది. ఈ ఇంటిని శాంతే నీట్‌గా సర్దేస్తుంటాడు. 'ఔనూ, మాఆయన ఎలా ఉన్నాడు?'

నిస్సంకోచంగా మాట్లాడేస్తోంది సునీల.

ఈ కాలం పిల్లలలోని ఒక అలవాటు భర్తని ఏకవచనంలో సంబోధించటం. కాస్త వెగటుగా అనిపిస్తుంది నాకు బహుశా పాతకాలం దాన్ని కనుక ఈ పద్ధతి నాకు నచ్చకపోవచ్చు అని మనసుని సమాధాన పరుచుకున్నాను.

ఓపావుగంట తర్వాత శ్రీవారు లేచారు. శాంతి మోహన్‌కి చెప్పారు 'మీ ఇద్దరూ కలిసి రండి' అని. అంతే. బయటికి నడిచారు.

'తప్పక రండి, సునీలా' అని నేనూ శ్రీవారిని అనుసరించాను.

## 3

సునీలా శాంతిమోహన్‌లు చిలకా గోరింకల్లా నవ్వుతూ, తుళ్ళుతూ కలిసి మాఇంటికి రెండు. మూడుసార్లు వచ్చారు. భోజనాలు చేసి వెళ్ళారు.

ఈ మధ్యలో సుమిత్రకి నాలుగైదు ఉత్తరాలు రాశాను. తనూ తృప్తిగా జవాబులు రాసింది.

ఒకటి, రెండు నెలలు గడిచాయి. సునీల వచ్చి చాలా రోజులైంది

అన్న విషయం గుర్తుకి వచ్చి శాంతిమోహన్‌కి ఫోన్ చేశాఎలాగు 'ఉన్నారూ?' అంటూ.

"బాగున్నాం, ఆంటీ. మాఅమ్మా, చెల్లీ వచ్చారు. అందువల్ల కాస్త బిజీ. కాస్త వీలుచూసుకుని వస్తాం" అని చెప్పాడు శాంతిమోహన్.

"సరే, బాబూ" అని ఫోన్ పెట్టేశాను. మరో పది రోజులు గడిచి పోయాయి.

ఒకరోజు సాయంకాలం ఆరు గంటలు కావస్తుండగా సునీల సూట్ కేస్ చేత్తో పట్టుకొని తుఫానులా ఆటో దిగింది.

"ఆంటీ!" అంటూ రెండు చేతులతోనూ వాటేసుకుని బావురుమని ఏడవసాగింది.

"ఏమైందమ్మా?" కంగారుపడిపోతూ అడిగాను.

"ఈ పెళ్ళి చేసుకుని చాలా పొరపాటు చేశాను అని ఇప్పుడు తెలుసుకున్నాను. ఆంటీ!"

'ఏమైంది! ఏం జరిగింది? శాంతిమోహన్ నిన్ను సరిగా చూడటం లేదా?'

'అదేం కాదు.'

'మరేమిటి? మీ అత్తగారు సతాయిస్తోందా! ఆవిడకి తెలియకుండా తన కొడుకుని పెళ్ళాడావని సినిమాల్లో, టివిల్లో చూపిస్తూన్నట్లుగా కిరసనాయిల్ డబ్బాలు చేత పుచ్చుకుందా?'

'అబ్బే! అదేం కాదు.'

'మరేమిటి! కూర్చో. కూర్చుని సరిగ్గా చెప్పు.' సునీల చెయ్యి పట్టుకుని లాగి కుర్చీలో కూలేశాను.

'ఆంటీ! నేను నరకం అనుభవించాను. ఇంక ఒక్క క్షణం కూడా

ఆ నరకంలో ఉండలేక వచ్చేశాను. ఎక్కడికైనా వెళ్ళిపోతాను. ఎలాగో బ్రతుకుతాను.'

నాకు విసుగు వచ్చేస్తుంది. మా అబ్బాయి లిద్దరూ నిశ్శబ్దంగా నిల్చుని వింటున్నారు పక్క గదిలోనించి.

'సునీలా! అసలేం జరిగిందో చెప్పమ్మా?' ఓర్పుతూడదీసుకుంటూ అనునయంగా అన్నాను.

'ఆంటీ! కులంగాని శాంతిని పెళ్ళాడినా అతనితో ఈ ఆరు నెలలుగా నాకేం ఇబ్బందీ కలగలేదు. కానీ, ఆ అత్త దయ్యం వచ్చినప్పటినుంచీ నా కష్టాలు ప్రారంభమైనాయి. తన కొడుకుని 'శాంతి' అని పిలవకూడదట. 'నువ్వు' అని అసలు అనకూడదట. ఆవిడ రోగిష్టిది. ఎప్పుడూ దగ్గుడూ, తుమ్ముతూ, మూలుగుతూ ఉంటుంది. తినటానికి ఏవేవో చేయాలంటుంది. కూతురికి పెళ్ళి చేసే బాధ్యత శాంతిమోహన్‌ది కనుక నేను పొదుపుగా ఖర్చు చేయాలంటుంది. ఆయన అర్ధరాత్రి వచ్చినా నేను లేచి వడ్డించాలని అంటుంది. నేను తన కొడుకుని పెళ్ళాడాను కనుక, తన ఇంటికి కొన్ని సంప్రదాయాలు ఉన్నాయి కనుక వాటిని పాటించి తీరాలి అని మరీ గట్టిగా అంటుంది. ఆవిడ వచ్చిన దగ్గరనుంచీ ఆవిడ బంధువులంటూ ఎవ రెవరో వస్తున్నారు. నీట్‌గా ఉంచుకున్న ఇంటిని ఖరాబు చేస్తున్నారు. అడుగడుగునా మాఇద్దరికీ ఘర్షణ సాగుతోంది. ఇది నేను భరించలేను. 'మీ అమ్మనీ, చెల్లెలినీ ఎక్కడికైనా పంపే సెయ్ కావాలంటే ఆ ఇద్దరికీ కొంత డబ్బు పంపు! అన్నాను శాంతితో.

అతను అందుకు ఒప్పుకోలేదు. 'ఈ వృద్ధాప్యంలో నా తల్లికి కావల సింది నేనూ, నే నిచ్చే ఆత్మీయతా, అభిమానం కానీ తిండికీ, బట్టలకీ కావలసిన డబ్బు కాదు. అది ఆమెకి ఇవ్వకుండా మననూ. ఆవిడ నా కన్న తల్లి. వృద్ధురాలు కావచ్చు. రోగిష్టిది కావచ్చు. ఇంక నా చెల్లెలు. ఆ పిల్లకి పెళ్ళి చేసి పంపేవరకూ నా దగ్గరే ఉంటుంది. ఈ విషయాలు మన పెళ్ళి కాక ముందే నీకు చెప్పాను. అప్పుడు నువ్వేమీ అభ్యంతరం చెప్పలేదు. ఓపికపట్టాలి కాస్త! అన్నాడు. అంతే.!

కన్నీళ్ళు తుడుచుకుంటూ గడగడా చెప్పేసింది సునీల.

విషయం ఏమిటో అర్థమైపోయింది నాకు.

'సునీలా! శాంతిమోహన్ చెప్పినది నిజమే కదమ్మా! వివాహం అంటే భర్త ఒక్కడే అంటే ఎలా? పెళ్ళికాకముందు ప్రతి మగాడికీ దాదాపు పాతిక, ముప్పై ఏళ్ళ జీవితం ఉంటుంది. ఆ జీవితం తల్లీ, తండ్రీ, అక్కా, చెల్లీ, అన్నా, తమ్ముడూ ఇలా తన వాళ్ళ అందరి జీవితాలలోనూ పెనవేసుకుని ఉంటుందమ్మా. పెళ్ళి అయిన తరవాత, తనదంటూ ఓ చిన్న ఇల్లూ, వాకిలీ ఏర్పడిన తర్వాత మెల్లమెల్లగా పాత అనుబంధాలు సళ్ళు వదలి కొత్త బంధాలు ఏర్పడతాయి. ఇవి ఎవరి జీవితంలోనూ తప్పవమ్మా!!

సునీల వీపు మీద చెయ్యివేసి నిమురుతూ అన్నాను.

సునీల విసుగ్గా చూసింది నావైపు.

"అంటీ, నా బాధ నీకు అర్థం కాలేదు. ఆ మడ్డి మనుషుల మధ్య ఆ అనాగరికుల మధ్య నేను ఒక్క క్షణం ఉండలేను. వెళ్ళిపోతాను."

"ఎక్కడికి వెళతావు!"

"అమ్మ దగ్గరికిమాత్రం వెళ్ళను. వదులు నా చెయ్యి." లాక్కో సాగింది సునీల.

"సునీలా! నువ్వు ఆవేశంలో తప్పుగా ఆలోచిస్తున్నావు. చూడూ అతి క్లిష్టమైన వివాహ వ్యవస్థ మీద దెబ్బతీసి నిన్న విజయం సాధించావని సంతోషించాను. కానీ, ఇవాళ జీవితంలో వచ్చిన చిన్న కలతలని పెద్దవిగా ఊహించుకొని, ఓడిపోయినదానిలా పారిపోతున్నావంటే నాకు చాలా బాధగా ఉంది. అదీకాక నిజంగా నువ్వు శాంతిమోహన్‌ని మనఃస్ఫూర్తిగా ప్రేమిస్తే అతణ్ణిబట్టి అతని తల్లినీ, చెల్లినీ అభిమానించాలి. ఇది నీ బాధ్యత."

"బాధ్యత కాదు వంకాయ్!" విసురుగా చెయ్యి లాక్కుని పెట్టె తీసుకుని వెళ్ళిపోయింది.

ఆ అమ్మాయిని ఆపలేకపోయాను. సునీల సుమిత్ర కూతురే కాదు. ఈ ఆరు నెలలుగా ఎంతో ఆత్మీయంగా ఉంటూ నా మనసులో చోటు చేసుకుంది. సునీల చేసిన ఈ పనికి కోపంగానూ ఉంది, బాధగానూ ఉంది నాకు.

ఈ కాలం స్త్రీ చదువు సంధ్యలవల్ల విజ్ఞాన వంతురాలు అవుతూ ఉంది అన్న సంతోషం పటాపంచలైపోయిండి. లేకుంటే అలాంటి చిన్న సమస్యలను పరిష్కరించుకోలేక ఇలాంటి నిర్ణయమా చేసేది?

నా బుర్ర తిరిగిపోతూంది.

అలా ఎంత సేపు గడిచిందో తెలియదు.

"ఏంటోయ్! నేను వచ్చి పది నిముషాలైనా గమనించవు. టీ ఇవ్వవు. ఏమిటంత దీర్ఘాలోచన." శ్రీవారి పలకరింపుకి ఈ లోకంలోకి వచ్చాను.

"చూడండీ మన సునీల ఏం చేసిందో?" అంటూ జరిగినదంతా చెప్పేశాను.

ఆయన ముఖంలో ఆశ్చర్యం చోటు చేసుకుంది.

'సునీలని ఆపలేకపోయావా?!

'ఆపలేకపోయాను. ఇందుకు మరీ బాధగా ఉంది. ఇప్పుడేం చేద్దాం?!

శ్రీవారు పది నిముషాలు ఆలోచనలో పడ్డారు. ఆ తర్వాత లేచారు.

'శాంతిమోహన్‌ని కలిసి వస్తానుండు.! స్కూటర్ తీసుకుని బయలుదేరారు.

'నేనూ వస్తాను.!

'వద్దు! అంటూ వెళ్ళిపోయారు.

మరో రెండు గంటలు గడిచిపోయాయి. తర్వాత వచ్చారు.

'సునీలకోసం చాలా చోట్ల వెతికాం నేనూ, శాంతిమోహన్. ఎక్కడా కనిపించలేదు. కానీ, తర్వాత తెలిసింది బెంగుళూరు వెళ్ళిపోయిందని.'

నా తల గిర్రున తిరగసాగింది.

'శాంతిమోహన్ తల పట్టుకుని కూర్చున్నాడు. అతని తల్లి తనిక్కడ ఒక్క క్షణం ఉండనని నెత్తీ నోరూ కొట్టుకొంటూ ఉంది. వారి ఆవేదనని చూడలేకపోయాను. బెంగుళూరులో సునీలకి తెలిసిన వారు ఎవరన్నా ఉన్నారో, లేదో అతనికి తెలియదట. చూడూ ఈ విషయం సుమిత్రకి వెంటనే టెలిగ్రామ్ ఇవ్వాలి.! శ్రీవారు ఆలోచిస్తూనే అన్నారు.

'సుమిత్రకి ఈ విషయం ఎలా తెలియజేయను? తెలియచేస్తే తను భరించగలదా?'

నిద్ర లేదు. కళ్ళు మండుతున్నాయి. రెండు రోజులు గడిచాయి.

విషయం ఇదీ అని తెలుపకుండా వెంటనే బయలుదేరి రమ్మని టెలిగ్రామ్ ఇచ్చాను సుమిత్రకు.

ఇక సుమిత్ర రాకకోసం ఎదురు చూస్తున్నాం. 'దాన్ని ఏమని ఓదార్చాలి? ఎలా ఓదార్చాలి?! ఇదే నా బాధ. వాకిట్లో ఏ ఆటో ఆగినా సుమిత్ర వచ్చిందేమో అన్నధ్యాసే. ఏదో తెలియని టెన్షన్‌గా ఉంది. నిలవలేంచుకోలేక సోఫాలో కూలబడ్డాను.

నిజంగానే వాకిట్లో ఆటో వచ్చి ఆగిన శబ్దం అయింది.

కళ్ళు గట్టిగా మూసుకున్నాను.

నన్నగా చెప్పుల చప్పుడు నా దగ్గరవరకూ వచ్చి ఆగిపోయింది.

ఇంక ఆగలేక "సుమిత్రా!" అంటూ కళ్ళు తెరిచాను.

"ఏమిటే అలా చూస్తున్నావు? నన్నెందుకూ ఇంత హఠాత్తుగా రమ్మని టెలిగ్రామ్ ఇచ్చావూ?" సుమిత్ర గొంతు విని నా కల్లలోనించి బయటికి వచ్చాను.

"ఔను. అవసరం ఉండే టెలిగ్రామ్ ఇచ్చాను, సుమిత్రా!" గట్టిగా దగ్గరికి లాక్కున్నాను.

"ఏమైంది? అందరూ బాగున్నారు కదూ?" సుమిత్ర భర్త కళ్ళజోడులోనించి చూస్తూ అడిగాడు దగ్గరగా వస్తూ.

"అలా కూర్చోండి చెప్తాను మీకీ వార్త ఎంత త్వరగా చెప్పైనా కంత తేలిక అవుతుంది. సుమిత్రా! ఏం జరిగిందంటే.... సునీల ఏం చేసిందంటే...."

"ఏం చేసింది?" సుమిత్రా, ఆమె భర్తా ఒకేసారే అడిగారు. వారి ముఖాల్లో ఆదుర్దా చూస్తుంటే నా గొంతులోనించి మాట రావటం లేదు. ఎలాగో గొంతు సవరించుకొని చెప్పటం ప్రారంభించబోతుండే "ప్రభా! ఆగు. చూడు ఎవరు వచ్చారో!" అన్న శ్రీవారి గొంతు విని తలెత్తి వాకిలి వైపు చూశాను.

'కలా, నిజమా! ఆశ్చర్యం నుంచి తేరుకుని కోపం పొంగి వస్తున్నా కళ్లు నులుముకుని చూశాను.

సునీల నిలబడి ఉంది. నేను చూడగానే అమాంతం వచ్చి ఒళ్ళో తల పెట్టుకుంది.

"ఆంటీ, క్షమించు. నేను ఆవేశంలో వెళ్ళిపోయినా నీ వన్న మాటలు మళ్ళీ మళ్ళీ గుర్తు చేసుకుని ఆలోచించాను ఆంటీ, నువ్వు చెప్పింది నిజం నిన్నటి గెలుపుని ఇవ్వాళ్టి ఓటమిగా మార్చుకోకూడదనీ, జీవితంనుంచి పిరికిదానిలా పారిపోకూడదనీ! శాంతినిబట్టే అతని వాళ్ళనీ అభిమానించాలనీ, బాధ్యత అతనిలానే స్వీకరించాలనీ। ఈ మాట ముందు నీకు చెప్పాలని ఇక్కడికి వచ్చాను."

సుమిత్రకి, ఆమె భర్తకి సునీల మాటలు వినిపించక "ఏమిటే?" అంటూ కూతుర్ని ప్రశ్నలతో ముంచెత్తసాగారు.

నా కిప్పుడు చాలా నిశ్చింతగా ఉంది, సుమిత్ర వేసే ఏ ప్రశ్నలకీ నేను జవాబు ఇవ్వనక్కరలేదని.

సునీల తెలివిగలది. అందుకే "నేను వెళ్ళిపోవాలమ్మా. మీరు కాస్త విశ్రాంతి తీసుకుని మాఇంటికి రండి" అంటూ వెళ్ళిపోయింది.

"ఏమిటే దాని వరస?" సుమిత్ర నా ముఖంలోకి గుచ్చి గుచ్చి చూడసాగింది.

ఏం చెప్పను?

*

(ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక 12-2-86)